క్లుప్తంగా

ఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈఓ రామాంజనేయులు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయ ఈఓగా రామాంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఉన్న ఈఓ నాగేంద్రుడు మూడు నెలల పాటు సెలవు పెట్టడంతో తాడిపత్రి గ్రూపు ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న రామాంజనేయులును తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయ ఈఓగా నియమించారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఫిబ్రవరి 6 నుంచి 12 వరకూ నిర్వహించే బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోండి



మాట్లాడుతున్న సీఐ మనోహర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని జ్యువెలరీ, కిరాణా, వస్త్ర దుకాణదారులు దుకాణాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వన్‌టౌన్, టూటౌన్ సీఐలు మనోహర్, మస్తాన్ సూచించారు. సోమవారం స్థానిక వన్‌టౌన్ పీఎస్‌లో పట్టణానికి చెందిన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల చోరీలు, ఇతర నేరాల నియంత్రణకు వీలుంటుందన్నారు. చోరీలు జరిగినా నిందితులను పట్టుకోవడానికి సులువుగా ఉంటుందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారులు అంగీకరించినట్లు సీఐలు తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాజబాబు

గుంతకల్లు రూరల్: మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజబాబు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం స్థానిక కసాపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన చేపట్టారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించడం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ క్షేమంగా ఇళ్లు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ




క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: విశ్వకర్మ వడ్రంగి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి విడుదల చేశారు. సోమవారం ఆమె నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో వడ్రంగి సంఘం అధ్యక్షుడు షేక్షావలి, ఉపాధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి బాషా, రాముడు తదితరులు పాల్గొన్నారు.

రేపు పింఛన్ రీ వెరిఫికేషన్

పెద్దవడుగూరు: మండలంలో మంచానికి పరిమితమైన వారి పింఛన్లను ఈ నెల 29న రీ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 38 మంది మంచానికి పరిమితమైన పింఛన్‌దారులు ఉన్నారన్నారు. అధికారులు వచ్చే సమయంలో వారు ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. మిడుతూరు, కాశేపల్లి, గుత్తిఅనంతపురం, విరుపాపురం, జి.వెంకటాంపల్లి, ఎ.తిమ్మాపురం, కొండుపల్లి, క్రిష్టిపాడు, కడదరగుట్టపల్లి, లక్ష్మంపల్లి, మల్లేనిపల్లి, మేడిమాకులపల్లి, పెద్దవడుగూరు, దిమ్మగుడి, కండ్లగూడూరు, చిన్నవడుగూరు, కొండూరు గ్రామాల్లో పింఛన్ రీ వెరిఫికేషన్ అధికారులు పర్యటిస్తారని ఆయన తెలిపారు.

ప్రజలపై మరో బాదుడు!



- భారీగా పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలు
- ఫిబ్రవరి 1నుంచి అమలుకు సర్కారు కసరత్తు
- కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న జనాలు



తాడిపత్రి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

తాడిపత్రి రూరల్: కూటమి ప్రభుత్వం ప్రజలను నడ్డివిరిచేందుకు సిద్ధమైంది. ఇప్పటికే పలు రకాల వడ్డీంపులతో ప్రజలను నిలువు దోపిడీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుతో ప్రజలకు వెన్నుపోటుపొడవనున్నాడు. అధికారంలోకి రాగానే సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని బూటకపు మాటలు చెప్పిన ఆయన రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుతో దగా చేయడానికి సిద్ధమయ్యారు. భూములు, స్థలాలు, నిర్మాణాల విలువను పెంచడానికి కసరత్తు ప్రారంభించారు. పెంచిన భూముల మార్కెట్ విలువ చార్జీలు ఫిబ్రవరి 1 నుంచి అమలు చేయనున్నారు. భూముల విలువ పెంపుకు సంబంధించి నివేదికలను అధికారులు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. మార్కెట్ విలువ పెంపుపై ముసాయిదాను సబ్‌రిజిస్టర్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో అతికించారు. ఈనెల 24 వరకూ ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. 26న పరిశీలిస్తారు. 27న తుది జాబితాను జిల్లా మార్కెట్ విలువ కమిటీ ఆమోదం కోసం పంపారు. ఆమోదం అనంతరం ఫిబ్రవరి 1 నుంచి పెంచిన విలువపై ప్రజల నుంచి చార్జీలు వసులు చేస్తారు.

పెరుగనున్న ధరలు

తాడిపత్రి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో తాడిపత్రి పట్టణ, మండలం, పెద్దపప్పూరు, పుట్లూరు, యల్లనూరు మండలాలు ఉన్నాయి. ఫిబ్రవరి 1 నుంచి పెరగనున్న మార్కెట్ విలువ ప్రకారం మునిసిపాలిటీ పరిధిలోని అపార్ట్‌మెంట్ల మొదటి, రెండో అంతస్తుల్లోని ఒక్కోప్లాట్‌కు ఒక్కో చదరపు గజానికి రూ.90 చొప్పున పెరగనుంది. ప్రస్తుతం చదరపు అడుగుకు రిజిస్ట్రేషన్ విలువ రూ.1400 ఉండగా కొత్త ధర ప్రకారం రూ.1490 కానుంది. వాణిజ్య భవనాలకు సంబంధించి గతంలో కంటే అదనంగా రూ.100 వరకూ పెరునుంది. పంచాయతీల్లో చదరపు అడుగు రూ.70ల వరకూ పెంచనున్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారం ఢమాల్..

వైఎస్సార్‌సీపీ హయంలో ఒక వెలుగు వెలిగిన రియల్ ఎస్టేట్ వ్యాపారం కూటమి ప్రభుత్వం రాకతో పూర్తిగా కుంటుపడింది. వివిధ పథకాల ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి నెలా కోట్లాది రూపాయల డబ్బును ప్రజల ఖాతాల్లో వేసేది. ఆ డబ్బు సైక్లింగ్‌గా మారి అన్ని రకాల వ్యాపారాలు కళకళలాడేవి. అప్పట్లో తాడిపత్రి ప్రాంతంలో పెద్ద ఎత్తున విల్లాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం ద్వారా ఎంతో మందికి ఉపాధి కలిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రియల్ వ్యాపారం ఢమాల్ అయింది. రూ.లక్షల నుంచి రూ.కోట్లు పెట్టుబడి పెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లు, భూములను కొనుగోలు చేసే వారు లేక తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి నిలువునా మునిగిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మార్కెట్ విలువ పెంపు వారిని మరింత కృంగదీస్తోంది. పెరుగనున్న మార్కెట్ విలువ కారణంగా ప్లాట్లు, భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు రియల్ వ్యాపారాన్ని మరింత ముంచనున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. తాడిపత్రి పట్టణ, శివారు ప్రాంతంలో కొనుగోలు చేసేవారు వేసిన ప్లాట్లు ముళ్లకంపలమయ్యాయి.

ప్రతిపాదనలు పంపాం



మార్కెట్ విలువకు సంబంధించిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపాం. అంచనా మేరకు ఫిబ్రవరి 1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగవచ్చు. 20 శాతం వరకూ రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగే అవకాశం ఉంది. చార్జీల పెంపుపై కలెక్టర్ నిర్వహించిన సమావేశానికి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్‌లంతా హాజరయ్యాం.

– శివనారాయణ, సబ్ రిజిస్ట్రార్, తాడిపత్రి

'రియల్' వ్యాపారం దెబ్బతింటుంది



ఇప్పటికే రియల్ వ్యాపారం దెబ్బతినింది. రియల్ వ్యాపారాన్ని నమ్ముకున్న ఎంతో మంది వ్యాపారులు అప్పుల పాలవుతున్నారు. కొనుగోలు చేసిన ప్లాట్లకు డిమాండ్ లేక తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మార్కెట్ విలువ పెంచడం వల్ల రియల్ వ్యాపారం మరింత కుదేలు కానుంది.

– ఆదిశేషారెడ్డి, తాడిపత్రి

బాధిత రైతుకు న్యాయం చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుక్కరాయసముద్రం: మండలంలోని చెదల్ల గ్రామానికి చెందిన రైతు వన్నూరప్పకు న్యాయం చేయాలని జెడ్పీటీసీ భాస్కర్ కోరారు. సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాధిత రైతు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆయన తహసీల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ చెదల్ల గ్రామంకు చెందిన దళిత వన్నూరప్ప వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడుగా ఉండడంతో, టీడీపీ నాయకులు కక్ష సాధింపుకు పాల్పబడుతున్నారు. గ్రామంలో సర్వే నంబరు 106లో 1.50 ఎకరా భూమిని గత కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో పట్టా మంజూరు చేసిందన్నారు. ఈ భూమికి సంబంధించిన పత్రాలు రైతు వద్ద ఉన్నాయన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన పార్వతమ్మ, ఎర్రినాగమ్మ, ఎర్రిస్వామి, రామాంజి, పోతులయ్య , నారాయణ, నారాయణస్వా కలిసి రాజకీయ కక్షతో భూమిని సాగు చేయనీయకుండా వన్నూరప్పను అడ్డుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి భూ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బుక్కరాయసముద్రం సర్పంచ్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పార్వతి, చెదల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నరేష్, చికెన్ నారాయణస్వామి, పూల నారాయణస్వామి, రుషింగప్ప, చెన్నారెడ్డి, బయపరెడ్డి, రంగా , లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక రైళ్లు నడపండి



ఏడీఆర్‌ఎంకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: దాదపు రెండు నెలలుపాటు ప్యాసింజర్ రైళ్లు రద్దు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, తాత్కాలిక ప్రత్యేక రైళ్లు నడపాలని ఏఐఎస్‌ఎఫ్ గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, వెంకట్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఏడీఆర్‌ఎం సుధాకర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గుంతకల్లు-తిరుపతి ప్యాసింజర్ రైళ్లలో రోజూ వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, తిరుమల వెళ్లే భక్తులు రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా గుంతకల్లు-కల్లూరు రైలు మార్గంలోని గుళ్యపాళ్యం, వెంకటాంపల్లి, ఖాదర్‌పేట్ గ్రామస్తులు అనంతపురం, గుంతకల్లుకు వెళ్లేందుకు ఈ రైళ్ల మీద ఆధారపడ్డారు. కుంభామేళకు ఈ ప్యాసింజర్ రైళ్లను తరలించడంతో ఆయా వర్గాలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా ప్యాసింజర్ రైళ్లు పునఃప్రారంభానికి నెల రోజులపైగా ఉంది. అంతవరకూ ప్రత్యాయంగా గుంతకల్లు-ధర్మవరం మధ్య రైళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రోహిత్‌కుమార్, రాజ్‌కుమార్, సమీర్, రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

పుట్లూరు: మండలంలోని చింతకుంట గ్రామంలో ఉపాధి హామీ పనులను సోమవారం ఏపీఓ నరేంద్ర తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో ఉన్న కూలీల హాజరుపై ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయకుడు వెంగళరెడ్డి, క్షేత్ర సహాయకుడు మునేంద్ర పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న అధికారులు

పెద్దపప్పూరు: మాఘమాసం అశ్వత్థం తిరునాల బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని అధికారులు అన్నారు. సోమవారం అశ్వత్థంలో దేవదాయశాఖ కార్యనిర్వాహక అధికారి సుబ్రహ్మణ్యం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బాలాజీరాజు, ఎంపీడీఓ శకుంతల, ట్రాన్స్‌కో ఏఈ నరసింహులు, పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ గార్లదిన్నె రామకృష్ణారెడ్డి, పాలక మండలి సభ్యులు బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గుత్తి రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటుగా వ్యక్తిగత శుభ్రత పాటించాలని బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, దేవేంద్రనాయక్ సూచించారు. మండలంలోని సేవాగఢ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పంటి సమస్య ఉన్న విద్యార్థులకు వారు పలు సూచనలు చేశారు. సమస్యలున్న విద్యార్థులను గుర్తించి వారి పేర్లు, సమస్యలు ఆన్‌లైన్ చేశారు. హాస్టల్‌లోని వంటగది శుభ్రంగా ఉంచుకోవాలని భోజన ఏజెన్సీ సభ్యులకు సూచించారు. అనంతరం వసతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లాజరస్, ఆంజనేయులు, మౌనిక, సరస్వతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట గ్రామ సమీపంలో జాతీయ రహదారి మార్గమధ్యంలో సోమవారం రాత్రి పుట్లూరు మండలం కొండాపురం వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం బోల్తాపడింది. ఘటనలో ముచ్చుకోట గ్రామానికి చెందిన డ్రైవర్ బాబా, లక్ష్మన్న, ఆదినారాయణకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు తాడిపత్రి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్యం మెరుగుపరచండి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో అధ్వాన్నంగా మారిన పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి డిమాండ్ చేశారు. పారిశుధ్యాన్ని మెరుగుపరచడంలో అధికారుల వైఖరిని నిరసిస్తూ సోమవారం సీపీఎం నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో క్లాప్ ఆటోల ద్వారా ఇంటింటా చెత్తసేకరణ సక్రమంగా జరిగేదని, ప్రస్తుతం చెత్తను తీసుకెళ్లేవారు లేక ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయిందన్నారు. పీహెచ్ వర్కర్ల సంఖ్యను పెంచాలని వారు డిమాండ్‌చేశారు. అనంతరం కమిషనర్ నయీమ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమేష్, సురేంద్ర, రంగమ్మ, ఎస్.కె.బాషా, రాము, ఓబులేసు, సూరి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



మట్టి తరలిస్తున్న ప్రాంతాన్ని చూపుతున్న న్యూ డెమోక్రసీ నాయకులు

గుంతకల్లు: మండలంలోని చెన్నప్ప కొట్టాల రోడ్డు క్రాస్ వద్ద గర్సు గుట్ట నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న రైల్వే కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బీ.సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం పాంత్రాన్ని కమిటీ బృందం పరిశీలించింది. మట్టిని కాంట్రాక్టర్ అప్పారావు గుంతకల్లు-గుత్తి మధ్య జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనులకు వాడుకుంటున్నారన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. అధికారులు స్పందించి రైల్వే కాంట్రాక్టరుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జిలాన్, నారాయణ, షేక్షావలి, భాషా, గోపీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్యవైశ్య సంఘం కమిటీ ఎంపిక

గార్లదిన్నె: మండల కేంద్రంలోని శివాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండల కమిటీ సభ్యులు సోమవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. రాయలసీమ రీజనల్ చైర్మన్ చంద్ర మహేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా సురేష్ బాబు, ఉపాధ్యక్షుడిగా రమణయ్య, సెక్రటరీగా శివప్రసాద్, కోశాధికారిగా పవన్‌కుమార్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ఏపీ హంస గుత్తి తాలూకా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీవీ రాఘవ రెడ్డి, సెక్రటరీగా విజయప్రసాద్, ట్రెజరరీగా అంజు భార్గవి, అసోషియేషన్ ప్రెసిడెంట్‌గా చెన్నకేశవులు, ఉపాధ్యక్షుడిగా ప్రసన్నకుమార్, సూర్యలత, శ్రీరామిరెడ్డి, శరణ్య, సంయుక్త కార్యదర్శులుగా జాపుల్ల, రాజ్యలక్ష్మి ఎన్నికయ్యారు. మరో 5మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలి

శింగనమల: గ్రామాల్లో పనులు లేక కూలీలు వలసలు పోతున్నారని, ఉపాధి హామీ పనులు కల్పించాలని తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ నిర్మలాకుమారిని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కేటాయించాలన్నారు. వరి రైతులకు ఎరువులు వందశాతం సబ్సిడీతో పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసులు, వెంకటస్వామి, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అల్పాహారం, తాగునీరు పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం పెట్టాలని క్యాంటీన్ నిర్వాహకులను ఆయన ఆదేశించారు.

ఘనంగా గంధం మహోత్సవం



మసూద్ గాజీ దర్గాలో ప్రార్థన చేస్తున్న దృశ్యం

శింగనమల: హిందూ-ముస్లింల ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన సయ్యద్ సాలర్ మసూద్ గాజీ గంధం మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం గంధం మహోత్సవం పురస్కరించుకుని ఉదయం నుంచి దర్గాకు భక్తులు తరలివచ్చి ప్రార్థనలు చేశారు. రాత్రికి భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం మౌలానా హాఫీజ్ ప్రసంగించారు. రాత్రికి గంధాన్ని పూలతో అలంకరించి, గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో హిందువులు, ముస్లింలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడిపత్రి అర్బన్: మంగళవారం ఉదయం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డీఎం జీఎల్ శంకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో 9959225856 నంబరుకు ఫోన్ చేసి ప్రయాణికులు తమ సూచనలను, సలహాలను తెలియజేయాలన్నారు.

30న కౌన్సిల్ సమావేశం

గుత్తి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గురువారం ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మున్సిపల్ పాలక వర్గం, అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమైన అంశాల గురించి చర్చిస్తామన్నారు.

గేట్స్ హానర్ అవార్డుల ప్రదానోత్సవం



ప్రతిభావంతులను అభినందిస్తున్న గేట్స్ కళాశాల యాజమాన్యం

గుత్తి: గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం సోమవారం బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ చదువుతున్న విద్యార్థులకు ప్రతిభా అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ మాట్లాడుతూ అకాడమిక్ పరీక్షల్లో 75 నుంచి 100 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు ఏటా హానర్ అవార్డులు అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు టెక్నికల్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎండీ రఘునాథ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ భాష ప్రోగ్రామ్ కోఆర్డీనేటర్లు నవీన్‌కుమార్, బ్లెస్సీ, అధ్యాప కులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శివమాలధారులకు అన్నదానం



మాలధారులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని పార్వతీ సమేత భోగలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి శివరాత్రి వరకూ శివమాలధారులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు (గురుస్వామి) సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న శివమాలధారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్ల గుర్తింపు

గార్లదిన్నె: మండలంలోని తలగాచిపల్లి, కల్లూరులో 44వ జాతీయ రహదారిపై సోమవారం పోలీసులు, రవాణాశాఖ అధికారులు సంయుక్తంగా బ్లాక్‌స్పాట్లు గుర్తించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అరికట్టడానికి జాతీ య రహదారిపై చేపట్టాల్సిన చర్యలపై చర్చించామన్నారు.అలాగే సైన్ బోర్డులు, కాషన్ బోర్డులు,రోడ్ బేరియర్స్, స్పీడ్ బ్రేకర్లు, వంటివి ఏర్పాటుకు ప్రతి పాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డుగ్రహీతకు సన్మానం



కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో సోమవారం ఉత్తమ అవార్డుగ్రహీత, సబార్డినేట్ కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. రిపబ్లిక్ డేను పురస్కరించుకొని ఉత్తమ అవార్డు పొందిన ఆయనను ఆస్పత్రి వైద్యాధికారి శివ కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, కమిటీ సభ్యులు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కమలాధర్, హెడ్ నర్సు శివకుమారి, కమిటీ సభ్యురాలు లక్ష్మీదేవి, మెకానిక్ ఆనంద్, మల్లేశరెడ్డి పాల్గొన్నారు.